క్లుప్తంగా

టపాసుల దుకాణాల పరిశీలన


టపాసుల దుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కరుణాకర్

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను బుధవారం తహసీల్దార్ కరుణాకర్ పరిశీలించారు. దుకాణదారులు పొందిన లైసెన్స్ పత్రాలను కూడా పరిశీలించి సూచనలు చేశారు. దుకాణాల వద్ద నిబంధనలను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

దొమ్మతమరి అధ్యక్షుడిగా హనుమంతరాయప్ప


నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని దొమ్మతమరి గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన హనుమంతరాయప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయం మీటింగ్ హాల్‌లో బుధవారం జరిగిన ఎన్నికల్లో హనుమంతరాయప్ప ఒక్కరే నామినేషన్ పత్రం దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, తహసీల్దార్ వరదరాజు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు విశ్వేశ్వరయ్య, అక్కంపల్లి ఆదినారాయణ, గుమ్మఘట్ట శ్రీనివాసులు, పీడీఓ రంగధామప్ప తదితరులు నూతన అధ్యక్షుడు హనుమంతరాయప్పను అభినందించారు.

2న మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నవంబర్ 2వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామరావు తెలిపారు.

వేలం పాట వాయిదా

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ కేంద్రంలో నిర్మించిన గదులకు బహిరంగ వేలంపాట కార్యక్రమం వాయిదా పడింది. షెడ్యూలు ప్రకటించిన విధంగా బుధవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాట కార్యక్రమాన్ని చేపట్టేందుకు సన్నాహాలు చేశారు. అయితే అనివార్య కారణాల వల్ల వేలం పాట కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

కూలీల సంఖ్య పెంచండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామరావు

అమరాపురం: మండలంలో ఉపాధి పథకం కింద కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ రామరావు అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల: గ్రామీణ ప్రాంతాల్లో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి పథకం ద్వారా వంద రోజుల పని దినాలు కల్పించి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని ఏపీఓ ఓబుళప్ప పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ ఆదినారాయణ తెలిపారు. అనంతపురం ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ యోగా ఎంపిక పోటీల్లో భువనశ్రీ అండర్-14, తేజవర్ధన్‌రెడ్డి అండర్-17, శేషసాయివర్మ అండర్-14 విభాగాల్లో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. నెల్లూరులో నవంబర్ 2, 3 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో వారు పాల్గొంటారని చెప్పారు.

రెడ్ సిగ్నల్ !



- హిందూపురం రైల్వేస్టేషన్‌లో ఆగని ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లు
- నిత్యం ప్రయాణికుల అవస్థలు
- రైల్వే ఆదాయానికి గండి


హిందూపురం రైల్వేస్టేషన్

హిందూపురం అర్బన్: జిల్లాలోనే పెద్ద పట్టణం హిందూపురం. దాదాపు మూడు లక్షల జనాభా ఉంది. బ్రిటీష్ కాలంలోనే ఇక్కడ రైల్వే స్టేషన్ ఏర్పాటైంది. ఇది సౌత్‌వెస్ట్రన్ బెంగళూరు జోన్ కిందకు వస్తుంది. ఇక్కడి నుంచి బెంగళూరు 100 కిలో మీటర్లు. నిత్యం వ్యాపార.. ఉద్యోగరీత్యా వందలాది మంది వెళ్లడం.. రావడం సాధారణం. ఇక.. హైదరాబాద్, అయోధ్య, సోలాపూర్ ప్రాంతాలకు వెళ్లే వారూ ఎక్కువ. అయితే హిందూపురం స్టేషన్‌లో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు పలుమార్లు రైల్వే ఉన్నతాధికారులకు విన్నవించినా ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది.

అమృత్‌భారత్‌లో..

అమృత్ భారత్ స్కీమ్‌లో హిందూపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.15 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆ పనులు కూడా జోరుగా జరుగుతున్నాయి. అయితే ఎక్స్‌ప్రెస్, సూపర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడ ఆగకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పొందలేకపోతోంది.

ఆగని రైళ్లు ఇవే..

- కాచిగూడ-యశంతపూర్ (బెంగళూరు) మధ్య నడిచే వందే భారత్ (ట్రైన్ నంబర్ 20703) హిందూపురం రైల్వేస్టేషన్ మీదుగా వెళ్తున్నా ఆగడం లేదు.
- యశ్వంతపూర్ (బెంగళూరు)- కోర్బా (ఖాజీపేట్) మధ్య నడిచే ట్రైన్ నంబర్ 12251) హిందూపురంలో ఆగడం లేదు. దీంతో కాచిగూడ, నాగపూర్ వెళ్లే వారు అనంతపురం లేదా ధర్మవరం వెళ్లి ఎక్కాల్సి వస్తోంది.
- హసన్-సోలాపూర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 11312) హిందూపురంలో ఆపకపోవడంతో సోలాపూర్ వెళ్లే ప్రయాణికులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు.
- డా. అంబేడ్కర్‌నగర్ (డీఏడీఎన్) - యశ్వంతపూర్ మధ్య నడిచే వీక్లీ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 19301) సైతం నిలపకపోవడంతో ధర్మవరం వెళ్లి ఎక్కాల్సి వస్తోంది.
- గోరఖ్‌పూర్-యశంతపూర్ జంక్షన్ మధ్య నడిచే (ట్రైన్ నంబర్ 15023)గోరఖ్‌పూర్ జంక్షన్‌లో వదిలి వయా హిందూపురం మీదుగా యశ్వంతపూర్ చేరుకుంటుంది. అయితే హిందూపురంలో మాత్రం ఆగడం లేదు.

ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలు ఆపాలి



హిందూపురం నుంచి నిత్యం హైదరాబాద్-బెంగళూరుకు వెళ్లే వారి సంఖ్య హిందూపురంలో ఎక్కువ. అలాగే షిర్డి, అయోధ్య ఇలా పలు ప్రాంతాలకు వెళ్లే వారు కూడా ఉన్నారు. హిందూపురంలో ప్రతి ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్ల ఆపాలి. దీంతో ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది.

– అలీముల్లా, టీచర్, హిందూపురం

లేపాక్షిని దృష్టిలో పెట్టుకోవాలి



హిందూపురం రైల్వేస్టేషన్‌కు 14 కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రసిద్ధి గాంచిన లేపాక్షి ఆలయానికి దేశ వ్యాప్తంగా పలువురు యాత్రికులు సందర్శిస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి రైలులో వచ్చేందుకే ఎక్కువ మంది ఇష్టపడుతుంటారు. హిందూపురంలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆపేలా చర్యలు తీసుకోవాలి.

– హనుమంతు, టీచర్, లేపాక్షి

ఉన్నతాధికారులకు నివేదించాం



హిందూపురంలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడం వాస్తవమే. తాము పడుతున్న ఇబ్బందులను ఇప్పటికే పలువురు ప్రయాణికులు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ముఖ్యమైన రైళ్లు ఆపాలని ఇప్పటికే రైల్వే ముఖ్య అధికారులకు విన్నవించాము.

– కిరణ్, అసిస్టెంట్ డివిజనల్ కార్యదర్శి, ఎస్‌డబ్ల్యూఆర్

గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలి


సోమందేపల్లి: మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

- డీఎస్పీ వెంకటేశ్వర్లు

సోమందేపల్లి: క్షణికావేశాలకు లోనై గ్రామంలో ఘర్షణకు దిగకుండా ప్రశాంతంగా జీవించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం రాత్రి రంగేపల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై గ్రామస్తులకు పోలీసులు అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఉద్దేశ పూర్వకంగా అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేసుకోకుండా వాస్తవంగా వివక్షతకు గురై ఉంటే ఫిర్యాదులు చేయాలన్నారు.

పరిగి: సమాజంలో కులమత బేధాలకు తావులేదని, అందరూ సమానులేనని ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యుడు రామాంజినప్ప తెలిపారు. మండలంలోని పీ నరసాపురం ఎస్సీ కాలనీలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దారు, మండల మేజిస్ట్రేట్ హసీనా సుల్తానా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వక్తలు చట్టాలపై అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు రామాంజినప్ప

రొళ్ల: మండల పరిధిలోని కొడగార్లగుట్ట ఎస్సీ కాలనీలో బుధవారం సివిల్ రైట్స్ దినోత్సవం సందర్భంగా కాలనీ ప్రజలకు మడకశిర సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఐ రాజశేఖర్‌తో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గుడిబండ: మండల పరిధిలోని ఫళారం గ్రామంలోని దళిత కాలనీలో బుధవారం మహిళలు, యువకులకు నూతన చట్టాలపై ఎస్‌ఐ మునిప్రతాప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

దేశ సేవలో భాగస్వాములు కావాలి


ఏపీఆర్ఎస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్లు

పరిగి: దేశంలో జన్మించిన ప్రతి ఒక్కరికీ భారత దేశంపై గౌరవం పెంపొందాలని, అదేవిధంగా దేశ సేవలో అందరూ భాగస్వామ్యం కావాలని ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి ప్రిన్సిపల్ మురళీధర్‌బాబు తెలిపారు. మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్‌లో బుధవారం జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయిపటేల్ దేశ స్వాతంత్ర్య సమర సమయంలో బ్రిటీష్ పాలకులకు తన సత్తా చాటారన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు రామమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లేపాక్షి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డి వినతిపత్రం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

- కౌన్సిల్ మీట్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ

మడకశిర: మున్సిపాలిటీలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి అధికారులు చొరవ తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన కౌన్సిల్ మీట్‌కు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మున్సిపాలిటీలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని కోరారు. పారిశుధ్యంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రతి వార్డులో కూడా వీధిదీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వార్డుల వారీగా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా కౌన్సిలర్లు చెప్పే సమస్యలను అధికారులు జాప్యం చేయకుండా పరిష్కరించాలని కోరారు. సమస్యలపై నిర్లక్ష్యం చూపించవద్దన్నారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మున్సిపాలిటీలో షాపింగ్ కాంప్లెక్స్ లీజుకు ఇవ్వడం, పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి ఈ సమావేశంలో ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చెర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కమిషనర్ రంగస్వామి, ఏఈ మురళి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి, అధ్యాపకులు

హిందూపురం టౌన్: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు శాఖ నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీల్లో జిల్లా స్థాయిలో స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రగతి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆ కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించారు. ఏ.మదీహా, ఎస్.సిరివల్లి పోలీస్ శాఖ నిర్వహించిన వకృత్వ, వ్యాసరచన పోటీల్లో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఇది కళాశాలకు ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, అధ్యాపకులు శ్రీధర్, శ్రీలక్ష్మీ, ఎన్ఎస్ఎస్ పీఓ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్య గణన సర్వే సమగ్రంగా చేపట్టండి


సర్వే పై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నైపుణ్య గణన సర్వేను సమగ్రంగా చేపట్టాలని నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆయన నైపుణ్య గణన సర్వేకు సంబంధించి సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఈ సర్వే ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ముందుకు వెళ్లాలన్నారు. వాటి వల్ల యువతకు కొత్త అవకాశాలు కల్పించవచ్చన్నారు.

పెనుకొండ రూరల్: సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణనపై అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఉన్న సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. ప్రభుత్వం చేపట్టనున్న నైపుణ్య గణన సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సర్వేలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారి నైపుణ్యాన్ని తెలుసుకొని తద్వారా జీవన ప్రమాణాలను మెరుగు పర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు.

దీపావళి శోభ


టపాసుల దుకాణం వద్ద సందడి


కుటుంబ సభ్యులంతా కలసి..

హిందూపురం: పట్టణం దీపావళి శోభను సంతరించుకుంది. బుధవారం ప్రధాన వీధులు, మార్కెట్ పరిసరాలు కిటకిటలాడాయి. ముఖ్యంగా ఎంజీఎం మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు వద్ద సందడి వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులందరూ కలసి వచ్చి పెద్ద ఎత్తున బాణాసంచ కొనుగోలు చేశారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


బాణసంచా కొనుగోలు చేస్తున్న ప్రజలు


టపాసులను గురించి వివరిస్తున్న దుకాణదారుడు


క్రాకర్స్‌ను బాక్స్‌లో వేసుకుంటున్న చిన్నారులు

అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



హిందూపురం: నియోజకవర్గ ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, దుష్టశక్తులపై దైవభక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో ఆనంద కాంతులు నింపాలని ఆకాంక్షించారు. ఈ పండుగ సందర్భంగా సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని, దివ్వెల వెలుగులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో విరజిల్లాలని అభిలాషించారు.

రొళ్లను కరువు మండలంగా ప్రకటించాలి

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం రొళ్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్షం దెబ్బకు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ, పత్తి, మిరప, టమటతో పాటు రాగి, వరి ఇతరాత్ర పంటలు చేతికి వచ్చే సమయంలో పూర్తిగా కుళ్లిపోయి రైతులకు నష్టాన్ని మిగిల్చాయన్నారు. 450 హెక్టర్లకు పైగా పత్తి పంట చేతికి అందకుండా పోయిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలన్నారు.

చిలమత్తూరు పీహెచ్‌సీకి రూ.36 లక్షల పరికరాలు


ఆస్పత్రికి సామగ్రితో వైద్యాధికారి రామకృష్ణ

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ. 36 లక్షల పరికరాలు వచ్చినట్లు వైద్యాధికారి డా.రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) నుంచి డెలివరీ ఎక్విప్‌మెంట్, బెడ్స్‌తో పాటు పలు పరికరాలు వచ్చాయన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


తిమ్మరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుడ్డంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తిమ్మరాజు (35) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తిమ్మరాజు గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వహించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప నాయకులతో కలిసి గుడ్డంపల్లికి వెళ్లి మృతుడు తిమ్మరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరాజు, నర్సేగౌడ్ తదితరులు ఉన్నారు.

టపాసుల దుకాణాల ఏర్పాటు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం టపాసుల వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేశారు. పోలీసుల సూచనల మేరకు ఇసుక, నీరును అందుబాటులో ఉంచుకుని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మొత్తం 8 దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్ పోలీసు సిబ్బందిని టపాసుల దుకాణాల వద్ద నియమించారు. ఫైర్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి టపాసుల కేంద్రాల వద్ద పరిస్థితిని పర్యవేక్షించారు.